క్లుప్తంగా

పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు



రక్త నమూనా సేకరిస్తున్న వైద్యులు

ఏలూరు రూరల్: స్వచ్ఛతా హీ హీ సేవలో భాగంగా ఎంపీడీఓ బి.ప్రణవి, ఈఓపీఆర్డీ ఎం సరళ కుమారి పర్యవేక్షణలో ఏలూరు మండలం చాటపర్రులో సోమవారం పారిశుధ్య సిబ్బందికి ఉచిత వైద్యసేవ కార్యక్రమం గ్రామ కార్యదర్శి రవీంద్ర నిర్వహించారు. వైద్యులు ఎస్ చంద నవల్లి, కె.ప్రదీప్తి ఆధ్వర్యంలో 54 మంది పారిశుధ్య సిబ్బందికి గుండె, ఊపిరితిత్తులు, రక్త పోటు తదితర పరీక్షలు చేశారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, సర్పంచ్ గుడిపూడి రఘు మాట్లాడుతూ పారిశుధ్యం సిబ్బంది సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి, గౌరవించాలని సూచించారు.

కరాటేలో నిషితసాయికి బంగారు పతకం



నిషితసాయి

ఏలూరు రూరల్: ఏలూరుకు చెందిన ఎం నిషితసాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఆదివారం ఏలూరులోని టుబాకో మర్చంట్స్ చాంబర్ కళ్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నిషితసాయి ఏడేళ్ల వయస్సు విభాగంలో బంగారు పతకం సొంతం చేసుకుంది. ఆమెకు శిక్షణ అందిస్తున్న స్ప్రింగ్‌బోర్డు అకాడమీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

నేడు లక్ష్మీ గణపతి ఆలయ ఆభరణాల స్వాధీనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన స్వర్ణ, రజిత ఆభరణాలను దేవదాయ శాఖ మంగళవారం స్వాధీనం చేసుకుంటుందని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం విజయ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలను తమ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహించామని, ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్నీమంగళవారం లెక్కించనున్నట్టు పేర్కొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు సత్కారం

దెందులూరు: గ్రామాలను శుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు పాటుపడుతున్న గ్రీన్ అంబాసిడర్ల సేవలు చిరస్మరణీయమని గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. సోమవారం గోపన్నపాలెం సచివాలయంలో ఆరుగురు గ్రీన్ అంబాసిడర్లను సర్పంచ్, గ్రామ కార్యదర్శి సామ్యూల్‌బాబు సత్కరించారు.

గాంధీజీ ఆశయాలను సాధిద్దాం

ఘనంగా గాంధీ జయంతి

ఏలూరు రూరల్: స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన మహాత్మాగాంధీ ఆశయాలను సాధిద్దామని వక్తలు పిలుపునిచ్చారు. గాంధీజీ సేవలను గుర్తు చేశారు. అహింసతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత మహాత్మాగాంధీకే దక్కుతుందని ఏలూరు అర్బన్ తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. సోమవారం ఏలూరు మండల గ్రామాల్లో గాంధీ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమశేఖర్, ఏలూరు రూరల్ తహసీల్దార్ శ్రీనివాసరావు, డిప్యూటి తహశీల్దార్ గాయత్రి, మండల సర్వేయర్ విశ్వనాథ్, ఆర్ఐ నాయక్, వీఆర్వోలు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- దొండపాడు బధిరుల పరివర్తన పాఠశాలలో వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ సెక్రటరీ జి.సుధీర్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు, డీడీఆర్‌సీ సిబ్బంది, బాలబాలికలు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేశారు.
- ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంపాల వెంకటేశ్వరరావు, డివిజనల్ కౌన్సిలర్ అక్బర్, రిటైర్డ్ హెచ్‌ఎం జిల్లా వీరభద్రరావు, వాకర్స్ గాంధీ జయంతి వేడుక నిర్వహించారు.
- ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీడీఓ బి.ప్రణవి, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ సేవలను కొనియాడారు.

పోరాటంలో కొత్త పంథా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గాంధీజీ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి ప్రపంచానికి కొత్త పంథాని పరిచయం చేసిందని హిందూ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, జిల్లా రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వర్లు మాట్లాడారు. వైఎంహెచ్‌ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఇరదల ముద్దు కృష్ణ, సహాయ కార్యదర్శులు వేమా కోటేశ్వరరావు, సీహెచ్ సాయి తేజ, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్, కార్యనిర్వాహ కమిటీ ఉపాధ్యక్షుడు బీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సంకు సురేష్, గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్ లునాని, సభ్యులు పాల్గొన్నారు.



ఆర్‌ఆర్‌పేటలోని పల్లపుతోట గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



తహసీల్దార్ కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

జాతిపితకు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలందరినీ ఐక్యం చేసి పోరాడిన మహనీయుడు మహాత్మా గాంధీ అని ఏపీ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. ఆర్ఆర్‌పేటలోని పల్లపుతోట గాంధీ విగ్రహం వద్ద ఆయన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల త్యాగంతో సిద్ధించిన స్వాతంత్ర్యం నేడు మతోన్మాద పాలకుల చేతిల్లో చితికి పోతోందని వాపోయారు. కేంద్రంలోని బీజేపీ, ఆర్ఎస్ఎస్, కాషాయ మూకలు భారత ప్రజల మధ్య మత చిచ్చు పెడుతూ దేశాన్ని హిందూ మత రాజ్యంగా మార్చాలని చూడటం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో ఏపీపీలు ఆచంట వెంకటేశ్వరరావు, డీవీ రామాంజనేయులు, కొల్లి ఈశ్వర్, కింజంగి రాజు, వి.కిషోర్, తోట శివ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు కొనసాగాలి

దెందులూరు: మహాత్మగాంధీజీ ఆశయాలు అమలు చేయడమే ఆయనకు అర్పించే ఘన నివాళి అని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో దెందులూరు వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు కిషోర్ అధ్యక్షతన గాంధీజీ జయంతిని నిర్వహించారు. తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్ గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దెందులూరు నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో లాల్‌బహదూర్ శాస్త్రి, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నర్సింగ్ విద్యార్థులు నివాళులర్పించారు. సోమవరప్పాడు సెయింట్ జాన్స్ బీఈడీ కళాశాలలో ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పీ.బాల ఆధ్వర్యంలో గాంధీజీ జయంతిని నిర్వహించారు. అధ్యాపకులు అగస్టీన్, సాల్మన్, విద్యార్థులు పాల్గొన్నారు. గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు.



వైఎంహెచ్‌ఏ హాలులో నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

అహింసావాదంతోనే సమాజాభివృద్ధి

నిడమర్రు: మహాత్మగాంధీ అహింసా వాదంతోనే బ్రిటిష్‌వారిని గడగడలాడించి, దేశం నుండి తరిమి కొట్టారని, మనం కూడా ఆయన బాటలోనే నడవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గణపవరం మండలం పెదనింద్రకొలను గాంధీభవన్‌లో సర్వోదయ మండలి, మానవత ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా స్థాయిలో గాంధీ జీవిత చరిత్రకు సంబంధించి విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన 15 మందికి బహుమతులు, జ్ఞాపికలు, ప్రసంసా పత్రాలను ఎమ్మెల్యే వాసుబాబు అందజేశారు. నిడమర్రు మండల మానవత ఆధ్వర్యంలో పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థినికి రూ.10వేల నగదు సహాయాన్ని అందజేశారు.

నేటి నుంచి 13 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాని, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు వరప్రసాద్

ఏలూరు టౌన్: రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికీ అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పేదలకు మెరుగైన రీతిలో వైద్య చికిత్సలు, సేవలు అందించాలనే తపనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకూ ఆయా ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని వివరించారు. మెడికల్ క్యాంపుల్లో నిపుణులైన వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, వైద్య సిబ్బంది ఉంటారని, రోగులను పరీక్షించి, మందులను ఉచితంగా అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ నాగేశ్వరరావు, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు వరప్రసాద్, ఇతర వైద్య అధికారులు ఉన్నారు.

నేడు మాదేపల్లిలో వైద్య శిబిరం

ఏలూరు రూరల్: ఏలూరు మండలం మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారు. రోగులకు ఉదయం 9 గంటల నుంచి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

దాడులు సిగ్గుచేటు

ఏలూరు (టూటౌన్): నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు సోమవారం రాష్ట్రంలోని 60 సెంటర్లలో వివిధ పౌరహక్కుల, ప్రజా సంఘాల నాయకుల ఇళ్లపై దాడులు చేసి, సోదాలు నిర్వహించడం సిగ్గు చేటని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ టి.సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొవ్వూరులో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది ఎన్ శ్రీమన్నారాయణ ఇంటిపై దాడి చేసి, ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారని, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొన్నారని తెలిపారు.

పింఛను అందజేత

దెందులూరు: కొవ్వలి గ్రామానికి చెందిన కొప్పుల సంసోను గుంటూరు వైద్యశాలలో కిడ్నీ వ్యాధికి సంబంధించిన చికిత్స పొందుతున్నారు. సోమవారం కొవ్వలి క్లస్టర్ సీ-9 వలంటీర్ నిట్టా చిన్నారి గుంటూరు వెళ్లి పింఛను నగదును కొప్పుల సంసోన్‌కు అందజేశారు. గుంటూరు వెళ్లి కిడ్నీ బాధితుడికి పెన్షన్ అందజేసిన వలంటీర్ చిన్నారిని పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

థ్యాంక్యూ సీఎం సార్



ఏఎస్ఆర్ స్టేడియంలో థ్యాంక్యూ సీఎం అంటున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలోని నిరుద్యోగులైన 1 లక్షా 30 వేల మంది యువతకు గ్రామ, వార్డు సచివాలయాల్లో శాశ్వత ఉద్యోగాలు కల్పించిన గొప్ప నాయకులు, పరోక్షంగా మరో ఆరు లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో సోమవారం మెగా సెల్ఫీ క్యాంప్‌నకు హాజరైన 15 వేల మంది సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి మేయర్ నూర్జహాన్ క్షీరాభిషేకం చేశారు. నాలుగేళ్ల క్రితం 2019లో అధికారం చేపట్టిన అనంతరం సీఎం జగన్ అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. తమ జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజనల్ కో ఆర్డినేటర్ జీవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో వేలాదిమంది సమక్షంలో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు, డిప్యూటీ కమిషనర్ ఎన్.రాధా, ఏలూరు నగరంలోని సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు, నగరపాలక సంస్థ అధికారులు, కార్పొరేటర్లు, ఉన్నారు.

900 కుటుంబాలకు జాబ్ కార్డులు

ఏలూరు రూరల్: గాంధీజయంతి పురస్కరించుకుని సోమవారం చాటపర్రులో గ్రామసభ నిర్వహించారు. సభలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరానికి ముందే ఉపాధి హామీ పథకం బడ్జెట్ రూపొందించుకోవడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని అన్నారు. కూలీలకు పని కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికీ నిధులు సైతం రాబట్టవచ్చని చెప్పారు. సర్పంచ్ గుడిపూడి రఘు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 900 కుటుంబాలకు జాబ్‌కార్డులు మంజూరు చేశామన్నారు. వీరికి 100 రోజులు పని కల్పిస్తామని, రూ.4 కోట్లతో బడ్జెట్ రూపొందించామని చెప్పారు. ప్రతి కూలీ ఏడాదికి సుమారు రూ.22 వేలు వేతనం వచ్చేలా పనులు రూపకల్పన చేశామని వివరించారు. ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, కార్యదర్శి రవీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఈ క్రాప్‌తో రైతులకు మేలు

ఏలూరు రూరల్: ప్రభుత్వం చేపట్టిన ఈ క్రాప్ విధానం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తహసీల్దార్ జె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన ఏలూరు మండలం జాలిపూడి, చాటపర్రులో పంట చేలను పరిశీలించారు. పంటను వీఆర్వోలు పక్కాగా ఈ క్రాప్ నమోదు చేశారా లేదా అనేది పరిశీలిస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం విప్లవాత్మక విధానాలు అవలంబిస్తోందని, ఇందులో ఈ క్రాప్‌కు ఎంతో ప్రత్యేకత ఉందని చెప్పారు. పంట అమ్ముకునేందుకు, గిట్టుబాటు ధర వచ్చేందుకు, ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసేందుకు, వైఎస్సార్ రైతు భరోసా పథకం, సబ్సిడీపై విత్తనాలు అందజేత, ఫెస్టిసైడ్స్ పంపిణీ, సాగు రుణాలన్నీ ఈ క్రాప్ విధానంతో ముడిపడి ఉన్నాయని వివరించారు. ఆయన వెంట వీఆర్వో శేషగిరి తదితరులు ఉన్నారు.



చాటపర్రు పరిసరాల్లో పంటచేలు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కుట్టు మెషీన్లు, సైకిళ్లు, దుస్తుల పంపిణీ



మహిళకు కుట్టుమిషన్ అందిస్తున్న సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, కార్పొరేటర్ శ్రీదేవి



బాలుడికి సైకిల్ అందిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దివంగత పిల్లంగోళ్ల రంగారావు ద్వితీయ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఏలూరులోని ఆయన స్వగృహంలో పార్టీ నాయకులు, ఆత్మీయులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిల్లంగోళ్ల రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏలూరు 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, తల్లి పిల్లంగోళ్ల గిరికుమారి చేతులమీదుగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పలువురు మహిళలకు కుట్టు మెషీన్లు, సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ తమ తండ్రి రంగారావు ఆశయాల సాధనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఆదరణలేని పేదలకు భరోసాగా నిలిచేందుకే చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉక్కుసూరి గోపాలకృష్ణ, బోయిన కేదార్, వై.గణేష్, పాలడుగు మురళీ శ్యామ్, కొల్లిపర భగవాన్, మాజీ కార్పొరేటర్ గోపి, పార్టీ నాయకులు అస్లాం, సైదు కొండ, తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ కుటుంబానికి న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): తన కుమారుడి మృతికి కారకుడైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరుతూ వెంకటాపురం పరిధిలోని సదాశివ గార్డెన్స్ ఆండాళ్లమ్మ ఏరియాలో నివశిస్తోన్న పొనుగుపాటి పి.కృష్ణవేణి, ఆమె కుటుంబ సభ్యులు సోమవారం స్థానిక కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల వద్ద ఆందోళన చేశారు. తన కుమారుడు కిరణ్ (23) చనిపోవడానికి కారకుడైన ఎట్రించి ప్రకాష్ (25)పై చర్యలు తీసుకోవాలని కృష్ణవేణి కోరింది. 8వ తరగతి వరకు చదివి వెల్డింగ్ షాపులో కూలీగా పని చేస్తున్న కిరణ్‌కు అదేప్రాంతానికి చెందిన ప్రకాష్ నాలుగేళ్లుగా స్నేహంగా ఉంటూ చెడు వ్యసనాలకు బానిస చేశాడని ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 27న ప్రకాష్ తమ ఇంటికొచ్చి తన కుమారుడు సెల్ ఫోన్ ఇవ్వకపోతే వాడి అంతు చూస్తానంటూ బెదిరించి నానా దుర్భాషలాడాడని వాపోయింది. ఆ అవమానంతో తన కుమారుడు ఇంటిలో ఉరివేసుకుని చనిపోయాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రకాష్‌పై కేసు నమోదు చేయలేదని తెలిపింది. ప్రకాష్ బయట మామూలుగా తిరుగుతూ కిరణ్ తమను బెదిరిస్తున్నాడని, ప్రకాష్‌పై తక్షణ చర్యలు చేపట్టి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కృష్ణవేణి కోరింది.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
డీ.తిరుమల ఏలురు బీహెచ్‌ఈఎల్	22.15	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	24
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	11
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	16
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	18	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	05-07
బెండకాయలు	20	కంద	40
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	38
కాకర కాయలు	24	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	110
క్యాబేజీ	20	అల్లం	120-240
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	35
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	32	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	06
దోసకాయలు	20-26	పుదీనా	05
ఆనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	78
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40
		నిమ్మకాయలు (డజను)	--

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం

పెదపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెంలో బుధవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువచ్చారు. డ్రెయినేజీలు నిర్మించాలని, రహదారులు అభివృద్ధి చేయాలని, ఇళ్ల స్థలాలు అందించాలని, ఇంటి రుణం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. అందుకే ప్రతి కుటుంబానికి రూ.1లక్ష నుంచి రూ.7లక్షల వరకు పథకాల ద్వారా లబ్ధి చేకూర్చారని వివరించారు. మరలా పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతు కొనసాగించాల్సిన అవసముందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ ఇంటింటికీ అందించడానికి గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారని గుర్తు చేసారు. ప్రజలకు సక్రమంగా పథకాలు చేరవేస్తున్న వలంటీర్లపై కొంతమంది లేని ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు అప్పన కనకదుర్గాప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, గ్రామసచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీచంద్ర దుర్గాప్రసాద్, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్ గ్రామ సర్పంచ్ సిద్దాబత్తిన జోజమ్మ, ఎంపీటీసీ మారుమూడి కృపామణి, గోపి, ఘంటసాల ప్రభాకరరావు, రెడ్డి స్వర్ణకుమారి, వ్యవసాయ సలహా మండల అధ్యక్షుడు గొట్టాపు నర్సింహరావు, నాయకులు కడిమి గోవిందరావు, చేపేని రంగరావు, ఘంటసాల మోషే, ముంగర రమేష్ పాల్గొన్నారు.